సాక్షి ప్రకాశం

గురువారం । 7 । మార్చి । 2024



బ్రహ్మోత్సవాలు ఆరంభం

త్రిపురాంతకంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా త్రిపురాంతకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో..



పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తి

జిల్లాలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తయిందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. గుర్తింపుపొందిన పార్టీల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34.8/23.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్య మిత్ర నియామకాల మెరిట్ లిస్ట్ విడుదల

ఒంగోలు టౌన్: డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో జిల్లాలో ఖాళీగా 17 ఆరోగ్య మిత్ర, 2 టీం లీడర్ల నియామకాలకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్‌లో పెట్టినట్లు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నేరుగా ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ జిల్లా కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

జూనియర్ ఇంటర్ పరీక్షలకు 1688 మంది గైర్హాజరు

ఒంగోలు: జూనియర్ ఇంటర్ పరీక్షకు బుధవారం 1688 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం గణితం-1ఎ, బోటనీ, సివిక్స్ విద్యార్థులకు పరీక్ష జరిగింది. జనరల్ విభాగంలో 22,069 మందికిగాను 20,823 మంది, ఒకేషనల్ విభాగంలో 2752 మందికిగాను 2310 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1246 మంది, ఒకేషనల్ విభాగంలో 442 మంది వెరసి 1688 మంది గైర్హాజరయ్యారు.

ముగిసిన టెట్ పరీక్షలు

- 7302 మందికి 6524 మంది హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు బుధవారం జిల్లాలో ముగిశాయి. ఈ పరీక్షలు ఫిబ్రవరి 27వ తేదీ ప్రారంభం మొదలు నేటి వరకు రెండు సెషన్స్‌లో జరిగాయి. మొత్తంగా 7302 మంది హాజరుకావాల్సి ఉండగా 6524 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలోని ఐదు సెంటర్లలో పరీక్షలను పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కు పంపిణీ

- జిల్లా వ్యాప్తంగా 3775 మందికి రూ.2.82 కోట్లు విడుదల



చెక్కును విడుదల చేస్తున్న జేసీ గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ మీనా

మార్కాపురం: ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం అందిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లావ్యాప్తంగా 3775 మంది రైతులకు రూ.2.82 కోట్లు విడుదల చేశారు. ఆ చెక్కులను బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ట్రైనీ సబ్‌కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ అందజేశారు. గతేడాది కరువు, మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వలన నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. మార్కాపురం నియోజకవర్గంలో 631 మంది రైతులకు రూ.27.38 లక్షల పరిహారం, యర్రగొండపాలెం నియోజకవర్గంలో 1418 మంది రైతులకు రూ.1.10 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవీ, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్ వైద్య సేవలు ప్రారంభం



మాట్లాడుతున్న డా.భగవాన్ నాయక్

ఒంగోలు టౌన్: ఒంగోలు సర్వజన ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.భగవాన్ నాయక్ కోరారు. డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు బుధవారం జీజీహెచ్, వైద్య కళాశాల సిబ్బందికి స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ప్రసంగిస్తూ.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలు సర్వజన ఆస్పత్రిలో క్యాన్సర్ కు స్పెషాలిటీ వైద్యాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కొన్ని ముందు జాగ్రత్త చర్యలతో క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఆదిలోనే క్యాన్సర్‌ను జయించే అవకాశాలు ఉంటాయని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ ఏడుకొండలు చెప్పారు. సెర్వికల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్‌లు వేయవచ్చని ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కృష్ణబాబు తెలిపారు. గైనకాలజీ హెచ్‌ఓడి డా. సంధ్యారాణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అనాటమీ హెచ్‌ఓడీ డా.సుధాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





కరువు నేలపై చిరునవ్వుల సవ్వడి

చిరకాల స్వప్నం సాకారమైన వేళ.. కొండా కోనల నడుమ ఎక్కడో దూరాన ఉన్న కృష్ణా జలాలను రెండు సొరంగ మార్గాల ద్వారా కరువునేలపై తరలించే అద్భుత కార్యక్రమం నెరవేరడంతో అన్నదాతల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. 27 సంవత్సరాల క్రితం శిలాఫలకం వేసిన వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి కావటంతో పశ్చిమ ప్రకాశంలోని ప్రజల మోమున చిరునవ్వులు చిందించాయి. మహానేత వైఎస్సార్ చేతుల మీదుగా శంకుస్థాపన అయిన వెలిగొండ ప్రాజెక్టును ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించి చరిత్ర సృష్టించారు.

- దశాబ్దాల ఎదురు చూపులకు తెర
- వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితంతో పులకించిన పశ్చిమ ప్రకాశం
- ప్రాజెక్టు పనులు తండ్రి ప్రారంభిస్తే పూర్తి చేసే అవకాశం ఆ భగవంతుడు తనకిచ్చాడని సంతోషం వ్యక్తం చేసిన వైఎస్ జగన్
- అడుగడుగూ పరిశీలించి పరవశించిన సీఎం



వెలిగొండ ప్రాజెక్టు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, మంత్రి అంబటి రాంబాబు, బాలినేని, చెవిరెడ్డి, తాటిపర్తి, కలెక్టర్ దినేష్‌కుమార్



కాబోయే మంత్రి బాలినేని అని ప్రకటించిన సీఎం వైఎస్ జగన్...

సీఎం ప్రసంగం పూర్తయిన వెంటనే నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను పరిచయం చేశారు. అందులో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని ఉద్దేశించి కాబోయే మంత్రి బాలినేని అని వేదికమీదనే ప్రకటించారు. దీంతో బాలినేని అభిమానులు, అనుచరుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. సభా ప్రాంగణం ఒక్కసారిగా హోరెత్తింది. కేకలు, ఈలలు, అరుపులతో బాలినేని అనుచరులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

ఒంగోలు సబర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో జలయజ్ఞం పేరుతో పెద్ద విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరువు, ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో కృష్ణమ్మను తీసుకొచ్చేందుకు వెలిగొండ ప్రాజెక్టుకు ఆయన శ్రీకారం చుట్టారు. భారీ స్థాయిలో నిధులు కేటాయించి వెలిగొండ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం చేసి పనులు ప్రారంభించారు. ఆ మహానేత హయాంలోనే 50 శాతానికి పైగా నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ఆ తరువాత ఎన్ని పరిణామాలు చోటుచేసుకున్నా ప్రభుత్వాధినేతలు మాత్రం ఆ ప్రాజెక్టు పూర్తి చేయటానికి చిత్తశుద్ధి చూపలేదు. చివరకు ప్రాజెక్టుకు శిలాఫలకం వేసిన చంద్రబాబు మూడు సార్లు ముఖ్యమంత్రి అయినా ఆ ప్రాజెక్టును ఆదాయ వనరుగా మార్చుకున్నాడే కానీ పూర్తి చేయటానికి మాత్రం సంకల్పించలేదు. ప్రాజెక్టుకు గుండెకాయ వంటి రెండు టన్నెళ్ల నిర్మాణమే అత్యంత కీలకం. దానిని చంద్రబాబు అసలు పట్టించుకోనే లేదు. చివరకు మహానేత తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రాజెక్టుకు మోక్షం లభించింది. తన తండ్రి ప్రారంభించిన ప్రాజెక్టు తన చేతుల మీదుగా పూర్తి చేయటం భగవంతుడు తనికిచ్చిన వరంగా స్వయంగా సీఎం వైఎస్ జగన్ బుధవారం ప్రాజెక్టు నిర్వాశితులు, ఆయకట్టుదారులతో అన్నారు. ఈ రెండు టన్నెళ్లను జాతికి అంకితం చేయటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తండ్రి ఆశయాలను నెరవేర్చే తనయుడుగా సీఎం వైఎస్ జగన్ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. ప్రాజెక్టు ప్రాంతంలో అడుగడుగునూ పరిశీలించి పరవశించిపోయారు.



సీఎం ప్రసంగిస్తుండగా ఉత్సాహంగా జేజేలు పలుకుతున్న ఆయకట్టు రైతులు, వైఎస్సార్ సీపీ అభిమానులు

పూర్ణ కుంభంతో స్వాగతం...

వేదపండితులు పూర్ణకుంభం ద్వారా స్వాగతంతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకున్న జంట సొరంగాల కోసం ఏర్పాటు చేసిన పైలాన్ వద్దకు సీఎం వైఎస్ జగన్‌ను తీసుకెళ్లారు. జంట సొరంగాలకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేశారు. తొలుత హెలిప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు మంత్రులు, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్ వెంట హెలికాప్టర్‌లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కూడా వచ్చారు. అక్కడ నుంచి జలవనరుల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వెలిగొండ ప్రాజెక్టు నమూనాను నిశితంగా పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన జలవనరుల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోలు దిగారు. వాళ్లందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.



భాస్కర్ మంచి ఎంపీ అభ్యర్థి

భాస్కర్ మీకు మంచి ఎంపీ అభ్యర్థి.. దగ్గరుండి మంచి మెజార్టీతో గెలిపించండి..అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సభా వేదికపై నుంచి అభ్యర్థులను పరిచయం చేస్తున్న క్రమంతో తన పక్కనే ఉన్న ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని సీఎం పరిచయం చేశారు.

ఒక్కొక్కరిగా పరిచయం..

వెలిగొండ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో ప్రసంగించిన అనంతరం ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిచయం చేశారు. తొలుత స్థానిక యర్రగొండపాలెం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌ను పరిచయం చేస్తూ చంద్రశేఖర్ యర్రగొండపాలెం మన పార్టీకి ఎమ్మెల్యే అభ్యర్థి. త్వరలో ఎన్నికలు రానున్నాయి. అందరూ దగ్గరుండి మరీ చంద్ర అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించేందుకు దోహదపడండి. మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నా రాంబాబు కూడా ఉన్నారు. మంచి మెజారిటీతో గెలిపించాలి. కనిగిరి మన పార్టీ అభ్యర్థిగా దద్దాల నారాయణ ఉన్నారు.. ఆదరించండి. గిద్దలూరుకు కేపీ.నాగార్జున రెడ్డి, కొండపికి రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడుకు మేరుగు నాగార్జున అన్న, దర్శికి బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి, నెల్లూరు జిల్లా కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్‌లు కూడా పోటీలో ఉన్నారు. అందరినీ అఖండ మెజారిటీలతో గెలిపించండి అంటూ ప్రోత్సహించారు సీఎం వైఎస్ జగన్.

సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హెలికాప్టర్‌లో వచ్చారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జలవనరుల శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఎస్పీ పీ.పరమేశ్వర రెడ్డి, ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత దంపతులు, ఎమ్మెల్యేలు టీజేఆర్ సుదాకర బాబు, ప్రకాశం జిల్లా సీఈ ఆర్ మురళీనాథ్ రెడ్డి, ఎస్ఈ అబూతలేం, మెగా ఇంజినీరింగ్ సంస్థకు చెందిన వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద రెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యతో పాటు జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ అభ్యర్థులను పరిచయం చేస్తున్న సీఎం జగన్‌తో ఆదిలమూపు సురేష్, మేరుగు నాగార్జున, కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణ యాదవ్



ఇరిగేషన్ అధికారులతో సీఎం జగన్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం జగన్, ఎంపీ వైవీ



ప్రాజెక్టు వ్యూను పరిశీలిస్తున్న సీఎం జగన్



బాలినేనితో మంత్రులు మేరుగు, అంబటి, ఆదిమూలపు



ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

బంగారం పండిస్తాం

- నెరవేరిన పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం
- వచ్చే జూలై, ఆగస్టులో కృష్ణమ్మ పరుగులు
- ఆనందంలో మునిగిపోయిన రైతన్నలు

పెద్దదోర్నాల: పశ్చిమ ప్రకాశం రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కల కన్నుల ముందు సాకారం కావడంతో ఆనందంతో పరవశించిపోయారు. రైతుల హర్షధ్వానాల నడుమ వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి బుధవారం జాతికి అంకితం చేశారు. తొలుత వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. దట్టమైన నల్లమల అడువుల్లో ఉన్న వేలాది వన్యప్రాణులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అద్భుతమైన రెండు సొరంగ మార్గాల నిర్మాణం తలపెట్టిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిది అయితే.. దానిని పూర్తి చేసి ప్రారంభించిన ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుంటామంటున్నారు రైతులు. వచ్చే జూలై, ఆగస్టులో కృష్ణమ్మ పరుగులు తీస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించడంతో సభకు హాజరైన రైతాంగం పులకించిపోయింది. ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రైతులను 'సాక్షి' పలకరించింది. వారి మనోభావాలు ఇలా ఉన్నాయి...



సీఎంకు అభివాదం చేస్తున్న మహిళలు, రైతులు

పొలాలకు మహర్దశ



ప్రాజెక్టు నిర్మాణం కోసం 9 ఎకరాలు ప్రభుత్వానికి అందించాం. వైఎస్ రాజశేఖరరెడ్డి మృతితో ప్రాజెక్టును అనంతరం ముఖ్యమంత్రులు పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టు నిర్మాణంలో కదలిక వచ్చింది. ప్రాజెక్టు పూర్తి కావడంతో మా రైతుల కల నెరవేరింది. ఇక మా ప్రాంత పొలాలకు మహర్దశ తిరిగింది. రైతుల కష్టాలు తెలుసుకుని వారికి చేయూతనిస్తున్న మనసున్న నేత సీఎం జగన్.

– దొందేటి వెంకటేశ్వరరెడ్డి, కొత్తూరు, పెద్దదోర్నాల

పంట భూములు సస్యశ్యామలం



వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసిన జగన్‌మోహన్ రెడ్డి వచ్చే జూలై, ఆగస్టు నాటికి నీరందిస్తామని ప్రకటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రాజెక్టు పూర్తయి రిజర్వాయర్‌కు నీరు వస్తే ఈ ప్రాంతమంతా ఎంతో సస్యశ్యామలంగా మారుతుంది. ప్రాజెక్టును పూర్తి చేసిన జగనన్నకు ధన్యవాదాలు.

– శొంటి రాధాకృష్ణ, తోకపల్లి, పెద్దారవీడు

స్వచ్ఛమైన తాగునీరు అందనుంది



నాడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తే.. నేడు ఆయన తనయుడు జగన్ మోహనరెడ్డి ప్రాజెక్టును పూర్తి చేశారు. సాగునీటి ఇబ్బందులు తెలిసిన వారే ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపడతారు. తీవ్రమైన ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడే ఈ ప్రాంత ప్రజలకు ఇకపై స్వచ్ఛమైన మంచినీరు దొరుకుతుంది.

– కొర్లకుంట జానకీ రఘు, పుల్లలచెరువు

అపర భగీరధుడు సీఎం జగన్



వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావటం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇప్పటి వరకు మా వ్యవసాయ భూముల్లో నీరు లేక పంట దిగుబడి అరకొరగా ఉండేది. ప్రాజెక్టు పూర్తయింది కాబట్టి ఇకపై మా భూముల్లో బంగారం పండిస్తామన్న నమ్మకం వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పాలిట అపర భగీరధుడు.

– మూల కొండారెడ్డి, మద్దలకట్ట, పెద్దారవీడు


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలినేని


మంత్రి మేరుగు నాగార్జున


మంత్రి ఆదిమూలపు సురేష్


ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి


బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్


ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్


ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


ఎమ్మెల్సీ పోతుల సునీత దంపతులు


తాటిపర్తి చంద్రశేఖర్(వైపాలెం)


దద్దాల నారాయణ(కనిగిరి)


పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి


కుప్పం ప్రసాద్


ఉమామహేశ్వరరెడ్డి(ఎంఈఐఎల్)


ఐజీ పాలరాజు


ఈఎన్‌సీ నారాయణరెడ్డి


కలెక్టర్ దినేష్‌కుమార్


ఇరిగేషన్ పీఎస్ శశిభూషణ్‌కుమార్


జేసీ రోణంకి గోపాలకృష్ణ


ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్


సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా


ఎస్పీ పరమేశ్వరరెడ్డి

అపూర్వ స్వాగతం అంతులేని అభిమానం

లక్షలాది ప్రజల ఆకాంక్ష అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి బుధవారం ప్రారంభించేందుకు హాజరైన సీఎం వైఎస్ జగన్‌కు పెద్దదోర్నాల మండలం ఎగువ చెర్లోపల్లిలో మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక గ్రామాల రైతులు, యువత అడుగడుగునా అభిమానం చాటుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


అభిమానం గుండెల నిండా.. రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండా

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

పెద్దదోర్నాల: వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణాలను జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండల పరిధిలోని కొత్తూరు వద్ద నిర్మించిన హెలిప్యాడ్ వద్దకు బుధవారం ఉదయం 11.30 గంటలకు చేరుకున్నారు.

11.30 నుంచి 11.49 గంటల వరకు ముఖ్యనేతలు, అధికారులు అందించిన పుష్పగుచ్ఛాలు తీసుకున్నారు.

12.08 గ్యాలరీకి కాలినడకన చేరుకుని ప్రాజెక్టుకు ఫొటోలు తిలకించారు.

12.12 గంటలకు గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించిన ఎత్తిపోతల పథకానికి ప్రాజెక్టు వద్ద నుంచే శంకుస్థాపన చేశారు.

12.14 గంటలకు వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును తిలకించారు.

12.16 రెండో సొరంగ ప్రాంతంలో అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

12.42 ప్రాజెక్టు ప్రాంతంలో రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు.

1.02 నియోజకవర్గ నాయకులతో కలిశారు.

1.16 : ముఖ్యమంత్రి కోసం కేటాయించిన గ్రీన్‌రూంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు.

1.21 హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.

1.27 గంటలకు తాడేపల్లికి తిరుగు పయనమయ్యారు.


ప్రాజెక్ట్ వద్దకు చేరుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్



సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు


సీఎం ప్రసంగాన్ని మొబైల్ కెమెరాల్లో బంధిస్తూ..


సీఎం జగన్‌ను చూసిన సంతోషంలో రైతులు, మహిళలు

క్లుప్తంగా

గుండ్లబ్రహ్మేశ్వరానికి 75 వాహనాలకు అనుమతి

గిద్దలూరు రూరల్: మహాశివరాత్రి సందర్భంగా నల్లమల అభయారణ్యంలోని గుండ్లబ్రహ్మేశ్వరం ఆలయానికి వెళ్లేందుకు కేవలం 75 వాహనాలకు మాత్రమే అనుమతించినట్లు గిద్దలూరు ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అటవీ శాఖ నిబంధనలు పాటిస్తూ స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు. 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అభయారణ్యంలోకి వెళ్లి సాయంత్రం 6 గంటల్లోగా బయటకు వచ్చేయాలని స్పష్టం చేశారు. వన్యప్రాణులకు ఎటువంటి హాని కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య భక్తులను తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తి

● కలెక్టర్ దినేష్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయిందని, మొత్తం 62 పోలింగ్ కేంద్రాల పేర్లు, గదులు మార్పు చేశామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాలను మార్చరడంతోపాటు 62 పోలింగ్ కేంద్రాల పేర్లు, గదులు మార్పు చేశామని వెల్లడించారు. ఒంగోలు నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం, మార్కాపురం రెండు పోలింగ్ కేంద్రాలు, గిద్దలూరు 6, సంతనూతలపాడు 1, కనిగిరి 1, యర్రగొండపాలెం 1 పోలింగ్ కేంద్రాలను మార్పు చేసినట్లు వివరించారు. ఫారం 6, 8 పెండింగ్ క్లెయిమ్‌లు పూర్తయ్యాయన్నారు. నూతన ఓటరు కార్డులను పోస్టు ద్వారా ఓటర్లకు చేరుస్తున్నామన్నారు. 80 ఏళ్ల వయసు దాటిన వారు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, జాన్ ఇర్విన్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, సత్యం, రాజశేఖర్, కాలేషా, రఘురామ్ పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు ఆరంభం


చెవిరెడ్డి భాస్కరరెడ్డి కి స్వాగతం పలుకుతున్న వేదపండితులు

త్రిపురాంతకం: పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి రోజున స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, జాగారం రాత్రి సమయంలో లింగోద్భవ పూజ, కళ్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పందేలతోపాటు సామాజిక సత్రాల వద్ద భక్తులకు భోజన, వసతి సౌకర్యాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక పూజల్లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి

త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరి ఆలయాల్లో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు సాదర స్వాగతం పలికారు. ఆయన వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యల్లారెడ్డి ఉన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం


ఉన్నగురువాయిపాలెంలో తారు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అన్నా రాంబాబు

● వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు

● పొదిలిలో రూ.7 కోట్లతో సిమెంట్, తారు రోడ్ల పనులకు శంకుస్థాపన

పొదిలిరూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. బుధవారం పొదిలి విశ్వనాథపురంలోని బ్యాంక్ కాలనీ, బెస్తపాలెం, పాతూరులో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, మండలంలోని ఉన్నగురువాయిపాలెం నుంచి వెలిగండ్ల వరకు రూ.6.33 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా విశ్వనాథపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అన్నా పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని సూచించారు. గతంలో సంక్షేమ పథకం కావాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సివచ్చేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ నేతలు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, గుజ్జుల రమణారెడ్డి, కె.నరసింహారావు, సాయిరాజేశ్వరరావు, యక్కలి శేషగిరిరావు, ఉడుముల పిచ్చిరెడ్డి, వరలక్ష్మమ్మ, గూడూరి వినోద్, పులిగొర్ల శ్రీనివాసరావు, కె.సుబ్బారావు, ఫిరోజ్, గిరిబాబురెడ్డి, మహబూబ్ బాషా, బందీసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరు మృతి

యర్రగొండపాలెం: మండలంలోని గురిజేపల్లి వద్ద మోటారు బైక్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం బోయలపల్లెకు చెందిన ఆరికట్ల రమణయ్య(35), అతని మిత్రుడు తన్నీరు నాగయ్య కలిసి బైక్‌పై కుంట వైపు నుంచి వస్తున్న సమయంలో గురిజేపల్లి మూలమలుపు వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణయ్య మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.

హైవేపై ప్రమాదం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

● ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

● మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు తక్షణ సాయం అందించిన తాటిపర్తి


ఇజ్రాయేల్(ఫైల్)

త్రిపురాంతకం: అనంతపూర్–అమరావతి హైవేపై ఆటోను ఎస్కార్ట్ వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి సమీపంలో మంగళవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. దోర్నాల నుంచి వస్తున్న ఆటోను మంత్రి సురేష్ కాన్వాయ్‌లో ఆలస్యంగా వెళ్తున్న ఎస్కార్ట్ వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నార్నెపాటి ఇజ్రాయిల్ మృతి చెందగా, త్రిపురాంతకానికి చెందిన మీరావాలి గాయపడ్డారు. మీరావలిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాంబశివయ్య తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ద్వార ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. వైఎస్సార్ సీపీ వైపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆందోళనకారులతో మాట్లాడి ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.ఐదు లక్షలు అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సీఐ సుబ్బారావు చర్యలు చేపట్టారు.

ఆగకుండా వెళ్లాననడం అవాస్తవం

● మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సబర్బన్: తాను వాహన శ్రేణితో వెళ్తున్నప్పుడు రోడ్డు ప్రమాదం జరగలేదని మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తాను కాన్వాయ్‌తో ముందుగా వెళ్లానని, ఎస్కార్ట్ వాహనం చిన్న సమస్యతో ఆలస్యంగా వస్తున్న క్రమంలోనే ప్రమాదం జరిగిందని వివరించారు. ప్రమాదం జరిగినా ఆగకుండా వెళ్లిపోయానని కొందరు అసత్య ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

కారును ఢీకొట్టిన బైక్

● ప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


మృతి చెందిన ఇత్తడి ఏలియా

మార్కాపురం రూరల్: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన సంఘటన బుధవారం మార్కాపురం మండలంలోని రాయవరం ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిపై చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. ఇత్తడి ఏలియా(60), కుమరుడు అనోక్‌తో కలిసి దర్శి నుంచి మార్కాపురం మండలంలోని నికరంపల్లిలో శుభకార్యానికి వస్తున్న క్రమంలో రాయవరం బ్రిడ్జిపై వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టారు. బైక్‌పై వెనుక కూర్చున్న ఏలియా ఒక్కసారిగా రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అనోక్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. కారు కనిగిరి నుంచి మార్కాపురం వస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.